




సత్యం మందపాటి

# మీకు తెలుసని నాకు తెలుసు - 14

## కృష్ణ శాస్త్రీయం

‘మధురా నగరి సమీపంలో మలయాయాత సమీరంలో
అర్థ నిమీలిత దృక్కులతో నేనెదురు చూతునోయీ
కృష్ణా నీకై నేనెదురు చూతునోయీ... ’ అనే ఈ పాట నా కెంతో ఇష్టం.

సరళమైన పదాల పొందికతో, మృదుమధుర భావంతో ఎంతో చక్కటి సాహిత్యం, రాధిక విరహాన్ని మన కళ్ళ ముందు కదలాడిస్తుంది. ఇలాటి పాటలు ఎన్నో వ్రాసి, మన మనసున మల్లెల మాలలూగించినది శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు. తెలుగు సాహిత్యంలో ప్రప్రథమ సంపూర్ణ భావకవి.

‘సడి చేయకే, గాలి సడి చేయకే! బడలి ఒడిలో రాజు పవ్వళించేనే ... సడి చేయకే... ’ అని గాలిని ఎవరు ఆజ్ఞాపించగలరు ఒక్క కృష్ణశాస్త్రి తప్ప!

అలాగే మన ద్వారాలకి ఎన్నో తారామణి హారాలు కట్టిన ఆయన, తన గొంతు మూగపోయాక ‘నాకు మాత్రము గాన మున్నంత వరకు చాలు చాలు నీ ప్రణయ విశ్వాసమొకటె ... వెన్నెల మాట్లాడునా వెదజల్లును పరిమళాలు’ అని తన భావ కవితా పరిమళాలను వెదజల్లారు దేవులపల్లి కృష్ణశాస్త్రి.

అలాటి మహాకవిని స్మరించుకుంటూ, ఆయన గురించి మనకేం తెలుసో తెలుసుకుందాం.

1. కృష్ణశాస్త్రిగారు ఎప్పుడు ఎక్కడ జన్మించారో తెలుసా?
2. ఆయన వ్రాసిన కవితా సంకలనాలు... కనీసం మూడు చెప్పండి చూద్దాం.
3. ఆయన మంచి నాటికలు కూడా వ్రాశారు. వాటిలో కొన్ని పేర్లు?
4. కృష్ణశాస్త్రిగారి 500 సినీగీతాలతో ప్రచురించిన పుస్తకం పేరు?
5. ద్వారానికి తారామణి హారం, హారతి వెన్నెల కర్పూరం అనే పాట ఏ సినిమాకి వ్రాశారు?
6. ‘ప్రపంచం బాధ శ్రీశ్రీ బాధ. కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ’ అన్నదెవరు?
7. ‘దిగిరాను దిగిరాను దివి నుండి భువికి నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు’ అనే మాటలు వ్రాసిన కవిత ఏ పుస్తకంలోది?

8. ఆయన వ్రాసిన 'నీ మురళి మ్రోతలో వలపు పిలుపుందిరా, మ్రోగింపరా మురళి కృష్ణా!' అనే పాటని మధురంగా పాడిన గాయని ఎవరు?

9. కృష్ణశాస్త్రిగారి మేనగోడళ్ళు ఇద్దరు జానపద సంగీతంలో ఎనలేని సేవ చేసి, తమ తీయని గొంతులతో మనల్ని కొన్ని దశాబ్దాలుగా అలరిస్తున్నారు. వారిద్దరి పేర్లు చెప్పండి చూద్దాం.

10. కృష్ణశాస్త్రి గురించి, 'మల్లె పూల మీద పరుంటాడు, మంచి గంధం రాసుకుంటాడు, మరెందుకు ఏడుస్తాడు' అన్నదెవరు?

## గతనెల మీకు తెలుసని నాకు తెలుసు - 13 జవాబులు

1. తెలుగు సాహిత్యం మీద తన ముద్ర వేసిన ఆరుద్ర అసలు పేరేమిటో తెలుసా?

    భాగవతుల శివశంకర శాస్త్రి

2. 'కొండగాలి తిరిగింది గుండె వూసులాడింది' అనే పాటని ఆయన ఏ చిత్రానికి వ్రాశారు?

    ఉయ్యాల జంపాల

3. 'ఆంధ్ర సమగ్ర సాహిత్యం'ని ఆయన ఎన్ని సంపుటాలుగా వెలువరించారో తెలుసా?

    పదమూడు

4. 'సగము కమ్యూనిష్టు
   సగము కాపిటలిస్టు
   ఎందుకొచ్చిన రొష్టు
   ఓ కూనలమ్మా!' లాంటి కూనలమ్మ పదాల ఆ కూనలమ్మ ఎవరో మరి?

పదిహేనవ శతాబ్దం ముందు ఒక పోతురాజుగారి భార్య. ఆవిడకి ఏడుగురు ఆడపడుచులు. గుంటూరు నెల్లూరు ప్రాంతం మనిషి. ఆ కూనలమ్మ సంకీర్తనలు, కూనలమ్మ చీర, కూనలమ్మ వేటల గురించి కొన్ని పాటలు వున్నాయి. శ్రీనాథుడు క్రీడాభిరామంలో కూనలమ్మ గురించి వ్రాశాడు. కూనలమ్మ పదాలు కూనలమ్మపాడినవి కాదనీ, కూనలమ్మ మీద ఇతరులు పాడినవనీ చెబుతారు. అదేరకమైన ఛందస్సుతో ఆరుద్ర వ్రాసినవే ఈ కూనలమ్మ పదాలు.

5. ఆరుద్ర వ్రాసిన ఎన్నో పుస్తకాల్లో కనీసం నాలుగు పుస్తకాల పేర్లు చెప్పండి చూద్దాం.

    త్వమేవాహం, రాముడికి సీత ఏమవుతుంది?, అరబ్బీ మురబ్బాలు, శుద్ధ మధ్యాక్కరలు

6. ఆయన వ్రాసిన డిటెక్టివ్ నవలల్లో ఎర్ర గుర్రం మీద వచ్చే నాయకుడి పేరు గుర్తుందా?

    ఇన్స్పెక్టర్ వేణు

7. శంకర్ జైకిషన్ సంగీత సారథ్యంలో రాజ్‌కపూర్ డబ్బింగ్ సినిమాకి అచ్చ తెలుగు పాటలు వ్రాశారు. ఒక పాటలో అయితే 'పందిట్లో పెళ్ళవుతున్నాదీ, కను విందవుతున్నాదీ', 'గోరింటాకూ కోయగబోతే గోళ్ళు కందేనూ' అనే చక్కటి పదాల పొందిక కూడా కనిపిస్తుంది. ఆ సినిమా పేరు?

ప్రేమలేఖలు

8. 'స్కూలు కెళ్ళే పిల్లలే ముందు చేయాలి స్నానం, బాత్రూం క్యూలో నాన్నదే కడపటి స్థానం'
'ఆనందరావుగారు మాజీ జడ్జి, ఆయనకు చాల ఇష్టం కాంట్రాక్టు బ్రిడ్జి
అయినా వారి మధ్య డేది రమ్మి, అందుక్కారణం వారెప్పుడూ డమ్మి' ఇలాటి అంత్యప్రాసల పద్యాలకి ఆరుద్ర పెట్టిన పేరేమిటి?

ఇంటింటి పజ్యాలు

9. 'ఎవడురా విష్ణుండు ఎవడురా జిష్ణుండు ఏగెనటు దాగెనెటు యీడ్చుకొని రండు' అని ఆయన వ్రాసినదానికి, మాధవపెద్ది సత్యం పాడగా, యశస్వీ రంగారావు తన నటనతో అలరించిన చిత్రం పేరేమిటో తెలుసా?

చెంచులక్ష్మి

10. 'నువ్వంటేనే నాకు మోజు, అలా రాసిస్తానే దస్తావేజు' అనే కొంటె పాటని కొసరాజుగారు వ్రాశారంటాడు మా స్నేహితుడు. నేనేమో ఆరుద్ర అంటాను. మీరెవరితో ఏకీభవిస్తారు?

నాతోనే!

**** **** ****